



# నారికేళపాకం

వి. నారాయణరావు

ఒంటిగా కాలం గడుపుతున్న లక్ష్మణరావు ప్రశాంత జీవిత ప్రాంగణంలోకి ఒక స్త్రీ ప్రవేశించింది. దానితోటే ఒక తియ్యని సంచలనము, సుందరమైన ఝంఝామారుతం ప్రవేశించాయి.

చిన్నప్పటినుంచీ తనా అమ్మాయిని, ఎరుగును. పిల్లకి దగ్గర చుట్టాలవడం, రాకపోకలు తరుచు ఉండడంవల్ల. ఎన్నో సంవత్సరాలు ఉత్త అల్లరితోటీ, ఆడుకోవడాలతోటీ గడిచిపోయాయి. అదోలా కోలగా మొహం, నవ్వితే మొత్తము మొహమంతా మారిపోయి, కొత్తరూపం తెచ్చుకుంటుంది. సూదిగా మొనతేలినగడ్డం, నవ్వినప్పుడు ఇంకాసూదిగా అయిపోతుంది. సంపెంగ పువ్వులా వంపుతీరిన ముక్కూ. నల్లని మొహంమీద వెలిగిపోయే కళ్లు. ఏ అజంతా చిత్రాల్లోనూ ఏ అందగత్తెల మొహాల్లోనూ కనపడని రకం పెదిమలూ; అతనికీ ఏదో లేనిపోనివన్నీ కల్పించిపెట్టాయి. ఈ అభిప్రాయాలు అతనికెప్పుడు తట్టాయో అతనికి జ్ఞాపకం లేదు... కాని నిశ్చయంగా వాళ్ళిద్దరూ ఆడుకున్న చిన్నతనంలో యివేవీ తట్టలేదు. నిజానికి ఆ అమ్మాయి అందముగా ఉంటుందని ఎవరూ అనరు; అనలేదు. యిందాకా చెప్పిన ముఖభాగాలు అన్నీ వేరు వేరుగా అందంగా ఉన్నట్లు కనపడతాయి. కాని వాటిని ఒక దగ్గరకు చేర్చుకున్న ముఖం మొత్తం అందంగా లేదు. గమ్మత్తుగా ఎత్తైన నుదురు. నల్లని రంగు, కళ్ళల్లో వైశాల్యం కనిపించకపోవడము యివి బహుశా కొన్ని కారణాలు కావచ్చు. ఆవిడ అందంగా ఉంటుందని లక్ష్మణరావూ అనలేదు. కాని ఆ అమ్మాయి ఆకర్షణ బలవత్తరమైంది. ఆ అమ్మాయికి దూరంగా ఉన్నప్పుడు అనిపిస్తుంది. యీవిడేం లోకోత్తరమైన ఊర్వశి కాదు. రూపసి కాదు. అతి సామాన్యమైన అమ్మాయి అని. కాని ఎదురుగుండా కనపడితే కేవలం అతిశక్తివంతమైన అయస్కాంతం దాపులో యినపముక్కలా అయిపోతాడు.

ప్రథమంలో అతనికిది అర్థమయింది కాదు. ప్రేమ; అలాటివాటిలో లక్ష్మణరావుకేమీ పెద్ద అభిప్రాయాలు లేవు. ఆవిడ అందంగా వుంటుందనే అభిప్రాయం కలిగినప్పటినుంచీ ఆవిడని ప్రేమించేశాననీ, ఆమె లేకపోతే యిక జీవనం అసాధ్యమనీ నమ్మడం అతనికి చేతకాలేదు. అంతమాత్రాన కేవలం యీ ప్రేమే వట్టి అబద్ధమనీ 'లైలామజ్నూ!' 'రోమియో జూలియట్'లు కేవలం కథల్లో తప్ప సంసారాల్లో ఉండరనీ వాదించేరకం కూడా కాదు లక్ష్మణరావు. అసలు పాపం అతనికిలాటి విషయాలని గురించి ఆలోచించేపాటి తీరిక, అవసరం లేకుండానే జీవితం చాలాభాగం గడిచిపోయింది అతని అదృష్టవశాత్తూ. కాని యీసారి అతనికే తెలియని మార్పులేవో జరిగిపోతున్నాయి అతనిలోపల. అందులోనూ విశేషం, మార్పేమిటో తెలియకపోవటమే కాదు. మొదట్లో అసలు మార్పు జరుగుతుందనే తెలియకపోవడం.

గడియారాలు పనిచెయ్యకపోతే కొంపమునిగే ఉద్యోగంలో ఉండి, గంటలకొద్దీ యింటిదగ్గర ఉండిపోతున్నాడు ఆ అమ్మాయితో మాట్లాడుతూ. చిన్నప్పుడు పిల్లిద్దరూ

కథానిక

ఆడుకొన్నప్పటికీ యిప్పటికీ ఆ అమ్మాయి యేమీ మారలేదు. చిలిపితనంలో, అల్లరిలో, మాటల్లో, నవ్వుల్లో. ఇంకెవరు మారారు అయితే... ఒక వేళ తనేనేమో.

నడుచుకుంటూ వెళ్ళిపోయేవాడు వసారాలోంచి గదిలోకి. ఏదో తన కాలికి అడ్డం తగిలేది అయిదు అడుగుల ఎత్తుకుపైనే చూడడానికి అలవాటుపడ్డ కళ్లు. శరీరం బోర్లాపడే స్థితికివచ్చాక అదిరిపడి చూచేవి. అంత సీరియస్‌గా ప్రక్కనే మంచం మీద కూర్చుని ఏదో పనిలో నిమగ్నమైనట్టు కనపడడానికి ప్రయత్నించే అమ్మాయి తప్ప మరే వస్తువూ మనిషీ, అక్కడ కనపడలేదు. తనకాలికి తగిలింది యీమె కాలని తెలుసుకోడానికి ఆట్టేసేపు పట్టదు. ఆ సంగతి ఆ అమ్మాయి కళ్ళు చెప్పేవి. వాటిని చదువుకో గలగడంచిత్రమయిన విద్య. ఎవరూ నేర్పలేదు కాని, లక్ష్మణరావుకి దానంతట అదే వచ్చేసింది.

ఏమయినా కొద్దిరోజులు గడిచేసరికి తనలో ఏదోమార్పు జరుగుతోందని లక్ష్మణరావు గ్రహించక తప్పిందికాదు. ఆ అమ్మాయి బలంగా తన ప్రభావం ప్రసరింపజేసింది. తనకు తెలియకుండానే ఆమె ప్రతి కదలికా చూడడానికి అలవాటు పడ్డాడు. గలగల నవ్వుల్తో, పరుగుల్తో, మాటల్తో యిట్టే కాలం గడిచిపోయేది. ఇంతకు ముందులా శెలవురోజులు శూన్యంగా కనపడటం లేదు. ఆమాటలు ఎక్కడనుంచి పుట్టుకొచ్చేవో ఆ అమ్మాయి కళ్ళు కావ్యాలు మాట్లాడేవి. తన శరీరం మొత్తం ఆ పాపల లోపల, నలుపు వెనకాల కనిపించేది. తనపళ్ళ తెలుపు జాడలు ఆ నలుపునీడల లోతుల్లోపడి, అల్లరిగా, చిలిపిగా కదిపేసేవి ఆ పాపల్ని. వాటి కదలికతో సమానంగా కదిలిపోయేవాడు తనూ. ఆ అమ్మాయి నిద్రపోయి లేచేసరికి నలిగిపోయిన జుట్టు మరీ భయంలేకుండా విచ్చలవిడిగా మొహంమీదఅల్లరి చేస్తూంటే నవ్వేసేవాడు. "ఏమిటా చింపిరితల" అని. ఎంతకోపం వచ్చేద ఆ అమ్మాయికి? కోపం వచ్చినపుడు ఆమూతి భలేపెడుతుంది గుండ్రంగా పెదమలుచుట్టి. అతనికి భయంవేసేది-తొందరగా నూనెరాసి దువ్వేసుకుందేమోనని. ఆ జుట్టు అలా ఉంటే యెంత బాగుంటుంది. ఆ అమ్మాయికి కూడా ఆ సంగతి తెలుసేమో. ఎంతకీ జడ వేసుకునేదికాదు. నిద్రమొహంతో బరువెక్కిన రెప్పలతో విశాలంగా నవ్వేది తల వెనక్కినెట్టి. ఆ పెదిమల మూల ఎన్నో అందాలు గూడు కట్టుకునేవి. మళ్ళా చప్పున నవ్వాపేసి చూసేది. సన్నంగా నొక్కుపడి, దగ్గిరగా చిక్కుపడి ఇంక విడవేమో అన్నంతగా బిగపట్టేదిపెదమల్ని. కళ్ళు చేసేవి మిగతా అల్లరి.

ఉన్నట్టుండి- వాళ్ళింటికెళ్ళిపోయింది. ఈ సంగతి లక్ష్మణరావుకు తెలుసు-కాని తెలియదు. ఏప్పుడో ఒకప్పుడు చుట్టపుచూపుగా వచ్చిన వీరు వెళ్లిపోతారని అతనికి మామూలుగా తెలుసు. కాని అతనికీ విషయం అనుభూతికొచ్చేదికాదు. విచిత్రమేమిటంటే-వాళ్ళింటికొచ్చిందీ అమ్మాయే అనిపించేదతనికి. మిగతావాళ్ళ విషయం గురుతే లేదు. యీ అమ్మాయి వెళ్ళిపోతుందని అనిపించనూలేదు. ఆమె తనకన్నా ముందునుంచీ ఆ యింట్లో ఉండనిపించేది. కాని నిజం దారుణంగా, నిర్దాక్షిణ్యంగా ఉంది. వాళ్ళేదో పనుండి వచ్చారు. వెళ్ళిపోయారు. లక్ష్మణరావు జీవితంలో వెలితి ఏర్పడింది-మొదటిసారిగా. కాని అదేపనిగా బెంగ పెట్టుకునే మనిషికాదులక్ష్మణరావు. కొంత కాలానికి సౌమ్యపడ్డాడు. తను రోజూ పనుల్లో పీకదాకా మునిగిపోయాడు. కాని ఏదో సమయంలో ఆ అమ్మాయి జ్ఞాపకం వస్తూండేది. నిజానికి అతనుచూసేదంతా ఎపుడో అదృశ్యమయిపోయేదీ - ఆ అమ్మాయి ఒక్కటే శాశ్వతమైనదీ అనిపించేది. ఇంత యిదిగా మారిపోయినట్టు లక్ష్మణరావు పైకిమాత్రంకనిపించడు.

* * *

అసలు లక్ష్మణరావు యింటికి వాళ్ళొచ్చింది ఒక చిక్కు వ్యవహారం కోసం. ఆ అమ్మాయి నాన్నగారు పోయినారు. దాంతో వాళ్ళన్నయ్యమీద వ్యవహారభారం పడింది. కాని పాపం అతను కుర్రవాడు. ఇంకా చదువుకుంటున్నాడు. ఒక విషంలో తల్లి స్వయంగా బయలుదేరి రావలసివచ్చింది కోర్టుపనికోసం. అన్నయ్యకి పరీక్షలు - అందుకని ఆ అమ్మాయినే తీసుకుని బయలుదేరి వచ్చింది ఆవిడ.

ఒక్కదెబ్బకే రెండుపిట్టల్లాగా వాళ్ళవ్యవ

హారం కుదరడమే కాకుండా, వాళ్ళన్నయ్యకి ఒక సంబంధంకూడా కుదిరింది. ఏదో వాడోయింటివాడయిపోవడం కుటుంబానికి కొంత మంచిదనుకుంది వాళ్ళమ్మ. వాళ్లుబాగా ఉన్నవాళ్లు. వాళ్ళ నాన్నగారు పోయేసరికి లక్షరూపాయలు ఆదాయంవచ్చే ఆస్తిఉండేది. చెట్టంతమనిషీ పోయింతరవాత వ్యవహారజ్ఞానంలేని వీళ్ళచేతులో కొంత హరించుకుపోయినా యింకాచాలా మిగిలింది. పెళ్ళిసంబంధం విషయంలో అబ్బాయికి నచ్చితే చాలునని అమ్మ అట్టే అడ్డాలు పెట్టలేదు. యింతకీ మనకి సంబందించిన దేమిటంటే పెళ్ళి సంబంధం లక్ష్మణరావు ఉన్న ఊరిలోదే.

ఒకరోజున శుభలేఖ వచ్చాక తెలిసినాయి యీ సంగతులన్నీ లక్ష్మణరావుకి. అతనెప్పుడూ ఏపెళ్ళికీ వెళ్ళలేదు. కాని ఎందుకో యీసారి పెళ్ళికి వెళ్ళబుద్ధయింది. పెళ్లివారిలో ఆ అమ్మాయి ఉంటుంది...లక్ష్మణరావువళ్ళు జలదరించింది.

వాళ్లు పెళ్లికెప్పుడు బయలుదేరి వస్తారో... విడిది ఎక్కడయిస్తారో - ఆడపెళ్లివారి యిల్లెక్కడో...అన్నీ తెలుసుకున్నాడు - అమ్మనడిగి. ఆవిడ చెప్పింది. కాని తనకొడుకు కొత్తగా యిలాంటివడుగుతున్నందుకు ఆశ్చర్యపోయింది.

పెళ్ళివారొచ్చారు - వాళ్లు విడిదికిపోయే దారిలోనే లక్ష్మణరావుయిల్లు. సామానులు, మనుష్యులూ తిన్నగా విడిదికెళ్ళారు. ఆ అమ్మాయీ - వాళ్ళమ్మా తిన్నగా లక్ష్మణరావు యింటికి వెళ్ళారు. లక్ష్మణరావు అప్పుడులోపల లేడు. కొంతసేపటికి అతను గుమ్మంలో కాలు పెట్టేసరికి ఎదురుగుండా అమ్మాయి కనబడింది. తెల్లగా మల్లెపువ్వులు పూసినట్టు నవ్వుతోంది. ఆశ్చర్యంతో "అరె!" అన్నాడు. నవ్వుతూనే "అరె!"అంది. యింకేమాటలూ దొరకలేదువాళ్ళకి.

ఆ చిన్న రెండుమాటలకీ ఎంతఅర్థం! మొదట "అరె"కి అనుకోకుండా వచ్చావే, అని అర్థం. రెండో "అరె!"కి ఏమిటీ ఆశ్చర్యం. యీ మాత్రం ఊహించుకోలేవా? దారిలో మీయింటికి వస్తామని అని అర్థం. యీవిషయాలు వాళ్ళ కళ్లు మాట్లాడేయి ..యివీ, యింకో కొన్నివేల సంగతులూ.

పెళ్ళి అయిపోయింది. లక్ష్మణరావుకి పెళ్ళిగొడవేలేదు. అతనికి ప్రపంచమంతా ఒకరే... ఆ అమ్మాయి, పెళ్లి-విడిది-ప్రపంచం-అన్నీ-ఆ అమ్మాయే! విచిత్రంగా యీ పెళ్ళిలో మగపెళ్ళివారి తరఫున వచ్చిన ఆడవాళ్ళంతా పరిచయమయ్యారు. ఎప్పుడూ యింతకుముందు తను యింతమంది ఆడవాళ్ళ నెరగడు. అలాగే మొగాళ్ళు అనేకమంది పరిచయమయ్యారు. తను ఆ అమ్మాయిని నవ్వించడంకోసం ఎన్నో కొత్తమాటలు మాట్లాడేవాడు. చూస్తూండగానే ఏమాటలూ రాని బుద్ధుడులా కూర్చునే లక్ష్మణరావు పెద్ద మాటకారి అయిపోయాడు. మొత్తం విడిది అంతటినీ నవ్వుల్లో ముంచెయ్యగల చాకచక్యం అలవాటయిపోయిందతనికి. కాని అతనిక్కావలసింది విడిదిలో ఎందరు నవ్వుతున్నారని కాదు. ఆ అమ్మాయి నవ్వుతోందా లేదా అని. ఇంతకుముందు లక్ష్మణరావు వేరు, యిప్పుడు లక్ష్మణరావువేరు. అతని ప్రతికదలికా, ప్రతిపనీ, యిప్పుడు యింకొకరికోసం.

ఆ అమ్మాయి చక్కగా పాడుతుంది. ఆపాటలన్నీ తనకోసంలాగా కనపడేవి లక్ష్మణరావుకి. ఆ అమ్మాయికి రేడియోలో పాడాలని సరదా. అసలాసరదా ఆమెకన్నా వాళ్ళఅమ్మకి ఎక్కువ. అందుకనే పట్టుబట్టి శాస్త్రీయసంగీతం నేర్పించింది. "నువ్వుయింక లక్షజన్మలెత్తినా ఆ స్థాయికి రావం"టాడు లక్ష్మణరావు. ఆ అమ్మాయికి కోపంవస్తుంది.

మనుగుడుపులకి వెళ్తూ ఆ అమ్మాయి అమ్మ లక్ష్మణరావునీ, తల్లినీ, రమ్మని బలవంతపెట్టేరు. గృహప్రవేశం, సత్యనారాయణవ్రతం యిలాంటివేవో చూసితీరాలన్నారు. అమ్మ వప్పుకుంటే బాగుండుననిపించింది లక్ష్మణరావుకి. 'సరే'అంది అమ్మ ఆవిడ పట్టుపట్టుబట్టి. వీళ్ళూ, వాళ్ళూ, అంతా బయలుదేరారు.

వాళ్ళఊరు కొత్తకాదు లక్ష్మణరావుకి. చిన్నప్పుడు చాలాసార్లు వెళ్ళేడు. ఇంటికి పెద్ద పెరడుంది. దాంట్లో ఒకపక్క తాటాకుసాల వేశారు. దానిలోకి బాగావంగి వెళ్ళాలి. లేకపోతే తగులుతుంది. ఆ అమ్మాయి వంగనక్కర్లేదు. అతను వంగుతూంటే నవ్వేది. ఓసారి

మరిచిపోయి తలెత్తేడు. ఠపీమని తగిలింది. ఆ అమ్మాయికి తగలదు. "భలేయిల్లు - యింట్లో అందరూపాట్లే-" అన్నాడు లక్ష్మణరావు. "నువ్వొచ్చావని గుమ్మాలు సాగదీస్తాం" అంది అమ్మాయి.

పగలు లక్ష్మణరావు వాళ్ళభోజనాలు అయిపోయాయి. ఆడవాళ్లు భోజనాలకి కూర్చున్నారు. మంచినీళ్ళు కావాలని లోపలికెళ్ళాడు లక్ష్మణరావు. అతనికెన్నిసార్లు నీళ్లుకావాలనిచెప్పినా, గబగబాతెస్తుంది ఆ అమ్మాయి. ఆ మంచినీళ్ళు సావకాశంగా తాగుతాడు గ్లాసుపక్కనుంచి ఓరగాచూస్తూ. అతనికెన్నిసార్లో దాహం వేస్తుంది. నోటికికాదు - హృదయానికి. కాని యీసారి ఆ అమ్మాయి ఆడవాళ్ళ పంక్తిలో కూర్చుని భోంచేస్తోంది. మంచినీళ్లు కావాలన్నాడు లక్ష్మణరావు. ఆ అమ్మాయి అంత వరకూ తన పక్క మంచినీళ్ళు తాగనేలేదు. చప్పున ఆ గ్లాసులో ఓ గుక్క తాగి- "యిదిగో" అని అందించిందిగ్లాసు. లక్ష్మణరావుకి ఒక్క క్షణంలో ఒకలక్షసంగతులు స్ఫురించాయి. ఆ అమ్మాయి తెల్లగా నవ్వుతోంది. మెరపులా వెనక్కి వెళ్ళిపోయాడు లక్ష్మణరావు. అతనిలో అన్నిభావాలు అణగారినాక "పెంకిపిల్ల" అనుకున్నాడు లక్ష్మణరావు.

రాత్రి భోజనాలవేళయింది. నాకాకలి లేదన్నాడు లక్ష్మణరావు. కొంతసేపటికి మొగాళ్ళ భోజనాలయిపోయాయి. పెరట్లో సాలపక్కనే ఆ అమ్మాయి కొంతమంది చిన్నపిల్లలూ వాళ్లతో భోజనానికి కూచుంది. ఆ అమ్మాయి అమ్మగారు యీపాటికి ఆకలేస్తుంది భోజనానికి లేవమన్నారు యింకా ఆకలికాలేదంటూనే లేచాడు లక్ష్మణరావు. వరసలో అన్ని విస్తళ్లలోనూ ఎవరెవరో కూర్చున్నారు. చిన్నపిల్లలుకూర్చున్న ఒకవరసలో చివర రెండేవిస్తళ్ళు ఖాళీగాఉన్నాయి.అందులో ఒకదాంట్లో ఆ అమ్మాయి కూచుంది. లక్ష్మణరావు రెండోవిస్తరిదగ్గిరకి నడిచాడు ఆ అమ్మాయి చటుక్కునలేచి మెఱపులా పరుగెట్టింది సాలలోకి. వెనకాలవెళ్లి లాక్కురావాలనుకున్నాడు. అరె! భోంచెయ్యదా? వెళ్లిపోయిందేం?అన్నాడు. అతనుకూడా కూచోకుండా నిలబడ్డాడు. సావకాశంగా నడిచివచ్చింది చేతిలో నేతిగిన్నెతో. "నిలబడ్డావేం. కూచో. మీ భోజనాలయాక నేనూ, అమ్మా, తింటాం"అంది ఎంతో డిప్లమేటిక్ గా లక్ష్మణరావు కూచోక తప్పలేదు. ఆ అమ్మాయి నెయ్యివొడ్డించడానికి వొంగింది. మెల్లిగా "ఎప్పటికేనా నాపక్కనకూచుని భోజనం చెయ్యవా?" అన్నాడు. అనేసి నాలికకరుచుకున్నాడు. "అంతయిదా?"అంది ఆ అమ్మాయి. అంతే-వెంటనే ఇతరులకి నెయ్యి వెయ్యడానికి వెళ్లిపోయింది. లక్ష్మణరావు భోజనంచేశాడు. కాని దృష్టి తనప్రశ్నమీద దానికి వచ్చిన జవాబుమీదే ఉంది.

తను అన్నమాట ఎంత అనుకోకుండా అన్నాడు! ఏమిటామాట! దానికి ఎంతశక్తి ఉంది! ఎంతదూరం వెళ్ళింది. "అంతయిదా" అంటే ఏమిటి?

నిజానికి అతనిలో ఆ అమ్మాయిని తన జీవిత భాగస్వామిని చేసుకోవాలనే ఆలోచన ఉందో లేదో అతనికే తెలియదు. ఆ అమ్మాయి తనకేదో అపూర్వంగా తోచింది. అలవాటు ప్రకారం అందంగా ఉందేమోనని పరిశీలించాలనుకున్నాడు సాధ్యంకాలేదు. అసలు అందంగా ఉండిఉంటే యీబలవత్తరమైన ఆకర్షణ ఆమెలో ఉండేదికాదేమో! ఆమె మామూలుగా, సన్నగా, నల్లగా, అతిసామాన్యంగా ఉంది. ఆమెది "సౌందర్యం"కాదు. అంతకన్నా పైమెట్టు. ఒక మెరుపుతీగ. ఆమె రూపంలో ప్రతి రేఖ పరిశీలించి అందంతో తూచి నిర్ణయిద్దామనుకునేవాడు. ఆమెముందు నిలబడేసరికి అన్నీ మరిచిపోయి, అందం అన్న మాటే మరిచి, నిలబడిపోయేవాడు. మెరుపుతీగలో ప్రతిరేఖా ఎవడేనా పరిశీలించగలడా? యీమెనీ అంతే. చివరికి, అసలామె అందంగాలేదనే నిర్ణయానికి రావడానికి అతను పడుతున్న శ్రమే ఆమె ఆకర్షణకి ఒక పెద్ద నిదర్శనం అనిపించింది. యిలాంటి మనిషి తనది కావాలనే ఆలోచనకి తనెప్పుడూ వచ్చినట్టు జ్ఞాపకంలేదు. యింతకాలం ఆమెని ఒక సృష్టి విచిత్రంగానే ఆనందించాడు. ఏ అపేక్షాలేకుండానే చూచాడు. తనకి తెలియకుండానే మాట్లాడాడు, నవ్వాడు, నవ్వించాడు. ఇవాళ అకస్మాత్తుగా తను అన్నమాటలో ఈ

అర్థం స్ఫురించడం తనకే విచిత్రంగా తోచింది. తన జీవితం ఎంత బాగుంటుంది ఆమె తనదయితే ప్రపంచంలో యింకెవరితోనూ సంబంధం లేకుండా ఏదోఒక అపూర్వశక్తిమయ సౌందర్యం కేంద్రంగా తన జీవితం ఒక విచిత్ర చంక్రమణం చేస్తుంది. కాని ఏమంది ఆమె? "అంత యిదా!" అంది. అంటే — అంత అదృష్టమా! అనికదూ ఆ అమ్మాయికీ అతనంటే... అతని వళ్ళు పులకరించింది.

* * *

ఇంటికొచ్చేశారు తనూ అమ్మా. చాలారోజులు గడిచిపోయాయి. ఇంతకుముందుకన్నా తరుచు అమ్మ తన పెళ్ళిమాట ఎత్తుతోంది. ఒకసారంది "వాళ్ళమ్మాయినిస్తే చేసుకోవచ్చు. ఎంచక్కా చిలకా గోరింకల్లా... మీకిద్దరికీ యీడూజోడూ బాగుంటుంది. ...కాని భాగ్యవంతులు. మనం సామాన్యులం..."

లక్ష్మణరావుకి యింతకుముందెప్పుడూ పరిచయంలేని కొత్తలోకం తలుపు తెరువబడ్డట్టయింది. వాళ్లు ఉన్నవాళ్ళు....బాగా ధనవంతుణ్ణి, ఎంతో హోదాగల వాళ్ళబ్బాయిని, రూపసిని చూసి పెళ్ళిచేస్తారు. ఆ అమ్మాయి అందుకే యిష్టపడుతుంది-సహజంగా. ఆవేళ అంతయిదా అంది, యిదా అర్థం. ఏదో నాకున్న సహజమయిన చురుకుతనంకొద్దీ, నీతో సరదాగా నవ్వి, అల్లరి చేశానుగాని, జీవితమంతా నీతో ముడిపెట్టుకుని నీతో బాధపడడానికి పుట్టాననుకున్నావా? నీకేమున్నదని నన్నింత ధైర్యంగా అడిగావు. నీవేం రూపసివనా- ధనవంతుడవనా! అని కాబోలు ఆ రోజు మాటలోని అర్థం. ఇదా యింటే యిదా!

లక్ష్మణరావు మనిషి మొత్తం ఎర్రబడిపోయాడు. మళ్ళీ ఆలోచించాడు. ఆమెదే రైటు-పూర్తిగా. అంత లోకాతీతమయిన ఆమె, ఒక స్వార్థంకోసం సర్వనాశనం ఎందుకు కావాలి? తనే సహించలేడు ఆ అభిప్రాయాన్ని. కాని ఆమెనిమాత్రం తను మరిచిపోలేడు. జీవితంలో కొంతభాగాన్ని మధురాతిమధురంగాచేసిన దివ్యమూర్తి.

మళ్ళీ రోజులు మామూలుగా గడిచిపోతున్నాయి. ఈసారి మునపటికన్నా బరువుగా నడుస్తున్నాయి ఈలోపుగా అమ్మకోసారి జబ్బుచేయడం, వాళ్ళ మామయ్యగారి పెద్దబ్బాయి "బావ" పెళ్ళి అవడం, తనకి ఉద్యోగంలో ప్రమోషన్ రావడం, ఇలాంటివెన్నో జరిగిపోయాయి. వీటన్నిటికీ వెనకాతల, చెట్లవెనక ఆకాశంలా, సినీమా బొమ్మలన్నీ ధరించే భరించే తెరలా, గ్రామఫోను ప్లేటులో పాట వెనక ముల్లుచేసే నిరంతర ధ్వనిలా, ఆ అమ్మాయి స్మృతి ఉంది; కదులుతూ.

ఈమధ్యలో మరోసారి ఆ అమ్మాయి రావడం తటస్థించింది. కాని అట్టేసేపు ఉండలేదు. కొన్ని గంటలుమాత్రం ఉండి వెళ్ళిపోయింది. తనకీసారి ఏదో లోపం అనిపించింది. తనమనసులో మార్పువల్ల తానింతకుముందుమల్లే ఆ అమ్మాయితో సరదాగా గడపలేదేమో అనుకున్నాడు. అంతేకాదు వీలున్నంతవరకు ఆ అమ్మాయికి దూరంగాఉండాలి అని నిశ్చయించాడు. కాని ఆవిడముందు ఇవన్నీ ఏమయిపోయాయో! ప్రభంజనంముందు పొగలా ఎగిరిపోయాయి! మామూలుగా నవ్వుల్లో కాలం గడిచిపోయింది. ఏమిటీ అవ్యక్త శక్తి. పోనీలే, ఎలాగూ తనకు అట్టేకాలం అందని ఈఅనుభూతి అవకాశం ఉన్నంతకాలం అనుభవించాలి. వద్దనుకున్నా మానలేకపోయినందుకు ఇలా సమాధానం చెప్పుకున్నాడు లక్ష్మణరావు.

ఒకరోజున ఆఫీసునుంచి యింటికొచ్చేసరికి వాళ్ళమ్మ ఏదో కార్డు యిచ్చింది లక్ష్మణరావుకి. ఆ అమ్మాయి రాసింది కార్డు! విచిత్రం. ఆవేళ సాయంత్రం రేడియోలో తన ప్రోగ్రామ్ ఉందిట. తప్పకుండా వినమని రాసింది. ఉత్తరం అమ్మకి రాసింది... కాని యిది కేవలం తనకే రాసిందని గ్రహించడానికి అట్టేసేపు పట్టలేదు లక్ష్మణరావుకి. నిలువునా కదలిపోయాడు. ఉత్తరం మళ్ళీమళ్ళీ చదువుకున్నాడు. ప్రతి అక్షరం వెనకాతలా ఆ అమ్మాయి నవ్వు, కళ్లు...

టైము అయిపోతూంది. రేడియో దగ్గిరికి వెళ్ళాలి. గబగబా వెళ్ళిపోయాడు రేడియో వినాలని అమ్మతో చెప్పి, అమ్మ ఎలాగా రాదు రేడియో వినడానికి

ఆమె, అసలా ఉత్తరం తనపేర రాయకుండా అమ్మపేర రాయడంలోనే ఉంది విశేషమంతా. లక్ష్మణరావుమీద ఆమెకున్న ఆసక్తిలో ఏదో విశేషం ఉంది. లక్ష్మణరావు వెనక తెలుసుకున్నవన్నీ మరిచిపోయాడు. “ఇది” అంటే అర్థం మారిపోయింది అతని నిఘంటువులో. తన పాట లక్ష్మణరావు వినాలనీ, విని తన్మయిత పొందాలనీ ఆ అమ్మాయి ఉద్దేశం... లక్ష్మణరావు తిన్నగా రాఘవరావు యింటికెళ్ళాడు. టైమైపోతోంది. కబుర్లలో దింపకుండా రేడియో పెట్టమని చెప్పి పాట విన్నాడు. ఆ పాట అతనికి లోకోత్తరంగా ఉందని వేరే చెప్పక్కరలేదు. కాని తనీ పాట వినడానికి ప్రత్యేకంగా వచ్చినట్టు తెలియపరచడం లక్ష్మణరావుకి యిష్టంలేదు. ఇంతకుముందెప్పుడూ లక్ష్మణరావు తన అభిమతాలు రాఘవరావుదగ్గర దాచలేదు. కాని, యీసారి దాచవలసివచ్చింది. రేడియోదగ్గరేకూచుని యింకేవేవో కొన్ని నిమిషాలు వింటున్నట్టు నటించాడు. మెల్లిగా మాటల్లోకి దిగాడు.

రాఘవరావు మాటల్లో ‘నాగ్’ సంగతి చెప్పాడు. ‘నాగ్’ అంటే, క్లాసుమేట్. స్కూలుఫైనలు దాకా ముగ్గురూ ఒక బడిలో చదివారు. ఎప్పుడూ ఒకరినివదిలి మరొకరు ఉండగలిగేవారు కాదు. రాఘవరావు వీళ్ళిద్దరికన్నా చాలా పెద్దవాడు. అందరికన్నా చిన్నవాడు లక్ష్మణరావు. అందరికన్నా ఉన్నవాడు నాగ్. అయినా ముగ్గురూ ఒక కంచంలో తిని ఒక మంచంమీద పడుకునే స్నేహితులు. స్కూలుఫైనలు పోయిన తరవాత నాగ్ కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో చదువుకోడానికి వెళ్ళిపోయాడు. అంతే. ఆ తరువాత అతనితో ఎందుకో దూరమయిపోయినట్టు అనిపించింది లక్ష్మణరావుకి. రాఘవరావు బి. ఏ. చదివి పెళ్ళిచేసుకున్నాడు. నాగ్ చదువు అయిపోయింది. ఆలిండియా రేడియోలో ఏదో పెద్ద ఉద్యోగి అయ్యాడు. అంతకన్నా విశేషాలు లక్ష్మణరావుకి తెలియవు. నాగ్ దగ్గరనుంచి లక్ష్మణరావుకి ఉత్తరాలు రావడంలేదు... కాని రాఘవరావుకి వస్తున్నాయి అప్పుడప్పుడు

నాగ్ గురించి రాఘవరావు ఓ కొత్తసంగతి చెప్పాడు. నాగ్ కి పెళ్ళి సంబంధం స్థిరపడిందట. ఆ అమ్మాయి అందమైనదేనని నాగ్ వప్పుకుంటాడటకూడా. ఈ సంగతులు నాగ్ ఉత్తరం వ్రాశాడు. ఆవిడ పాడుతుందట.

పాడుతుందనగానే సహజమయిన ఉత్సాహంతో, “ఆ అమ్మాయి ఎవరు?” అన్నాడు లక్ష్మణరావు. “ఈ ప్రాంతాలేనటోయ్! 'కృష్ణరాయపురం పర్వతనేనివారట'' గబగబా రేడియో క్రింద ఉత్తరం విప్పి తీసి “కీ. శే. పి. సాంబశివగారి ఏకైకసుపుత్రిక” అన్నాడు రాఘవరావు. లక్ష్మణరావు గుండె ఒకలిప్త ఆగిపోయింది! ఆ అమ్మాయే!

నాగ్ రేడియోలో ఉద్యోగి. ఆ అమ్మాయి పాడుతుంది. చక్కని సమన్వయం. ఎంతో భావరహితంగా, తనకేం సంబంధంలేనట్టు ఆలోచించాడు లక్ష్మణరావు. ఆ అమ్మాయి జీవితం తనేమీ గుత్తకి తీసుకోలేదు. “ఆకాశంమీదా పక్షిమీదా తనకెంత అధికారం ఉందో, ఆ అమ్మాయిమీదా అంతే అధికారముంది. ఆ పక్షి తన కానందాన్ని కలిగించినట్టే, ఆ అమ్మాయి ఆనందం కలిగించింది. అందుకని యింక అదంతా తన హక్కనుకునే మూర్ఖుడుకాదు లక్ష్మణరావు. అంతేకాదు యింకోమెట్టు ముందుకొచ్చాడు. ఆ అమ్మాయి నాగ్ ని పెళ్ళి చేసుకుంటేనే బాగుంటుంది.

లక్ష్మణరావు ఆలోచించే మొహంచూసి, రాఘవరావు తన కబుర్లు ఆపాడు. చెప్పాలిసినదింకా చాలాఉంది. లక్ష్మణరావు ఆలోచిస్తున్నాడు.

నాగ్ ని పెళ్ళాడడం మూలంగా ఆ అమ్మాయి చాలా పైకి వొస్తుంది. బంగారానికి మృదుత్వం సువాసన అబ్బినట్టవుతుంది. లక్ష్మణరావు పైకి అన్నాడు. “రఘూ! ఈ సంబంధం చాలా మంచిది. నాగ్ గొప్ప అదృష్టవంతుడు. నా శుభాకాంక్షలు కూడా పంపించు. వెళ్లొస్తాను తరవాత కలుసుకుంటాను. కొంచం పనుంది.”

లక్ష్మణరావు యింక అక్కడ ఉండలేదు. తనలో జరిగేవేవీ తెలియనియ్యదలుచుకోలేదు పైకి. రాఘవరావు ఆశ్చర్యపోయాడు. ఇంత హఠాత్తుగా లక్ష్మణరావు వెళ్ళిపోయాడేమిటా? అని. కాని అతనిలాంటి విషయాలు ఆలోచించి

లేనిపోని అర్థాలు కల్పించే స్వభావంకలవాడు కాదు. బహుశా ఆఫీసుపని ఏదో గుర్తుకువచ్చి ఉంటుందని అనుకుని ఊరుకున్నాడు.

అది సరే. ఇప్పుడు నాగ్‌గాడికేమని జవాబు రాయాలి. నాగ్‌కి యీ పెళ్ళి ఏమీ యిష్టంలేదు. భలే రాస్తాడు నాగ్. ఆ అమ్మాయి బాగుంటుందట, పాడుతుందట, కాని తన కిష్టంలేదట తల్లిదండ్రుల పట్టుదల, కట్నం వస్తుందనే ఆశ, వీటికి తను ఎల్లా ఒప్పుకోవాలో అర్థంకావటం లేదంటాడు నాగ్. వాడికి పెద్ద అనుమానం వచ్చింది. ఈ పెళ్ళి విషయంలో పెద్దవాళ్ళని ధిక్కరిస్తే, తల్లిదండ్రులకి అన్యాయం. ధిక్కరించకపోతే ఒక అమాయకురాలికి జీవితాంతం అన్యాయం. తరవాత తన జీవితమంతా కష్టం—వీటిమధ్య సమన్వయం ఎల్లా సాధించడం? నాగ్ కాశీ విశ్వవిద్యాలయంలో చదువుకునేటప్పుడు తనతో చదువుకున్న ఒక అమ్మాయినే పెళ్ళిచేసుకోవాలని గట్టిగా అనుకున్నాడు. వాళ్లు పార్సీలు, నాగ్ ఏవేవో మేడలుకట్టాడు మనసులో. అవ్వన్నీ కూలిపోకూడదంటాడు. మళ్ళీ తల్లీ దండ్రీ మనసులు కష్టపెట్టడం యిష్టంలేదు. ఎల్లా మరి?

తన ఆప్తస్నేహితుడు రాఘవరావుని అడిగాడు సలహా, లక్ష్మణరావుతో కలిసి ఆలోచించమని రాశాడు. నాగ్ రాస్తాడుకదా..."ఆ అమ్మాయి అందంగా ఉండొచ్చు, పాట చక్కగా పాడవచ్చు...కాని, ఆ అమ్మాయి నేను అనుకున్న పార్సీ అమ్మాయికాదు చూడు! ఇలాంటి విషయాలు పెద్దవాళ్ళకి ఎల్లా బోధపడేటట్టు చెప్పాలో అర్థంకాదు. మన వయస్సువాళ్ళకి యివి యిట్టే అర్థమయిపోతాయి!" సరే ఏదో ఆలోచించి నాగ్‌కి రేపు ఉత్తరం రాయాలి. లక్ష్మణరావు యివేవీ వినకుండానే వెళ్ళిపోయాడు గదా. రాఘవరావు రేడియో కట్టేసి భోజనానికి వెళ్ళిపోయాడు.

*　　*　　*

లక్ష్మణరావు యింటికి చేరుకున్నాడు. అంతా అర్థమయింది. ఆ అమ్మాయి రేడియోలో ఉన్న తన స్నేహితుడికి కాబోయే భార్య. సగం కథ మాత్రమే విన్న లక్ష్మణరావు త్వరగానే నిశ్చయానికి వచ్చేశాడు. ఈ సంగతులన్నీ ఆ అమ్మాయికి తెలిసీ, ఏమీ యెరగనట్టు తన పాట వినమని తనకుత్తరం రాయడమేమిటి? (ఆ ఉత్తరం తనకే రాసిందని లక్ష్మణరావు భావించుకున్నాడు) తనని ఫూల్ చెయ్యడానికా? లక్ష్మణరావుకి ఉక్రోషం వచ్చింది. ఆవేళ 'అంత యిదా' అంది. ఇందుకే 'ఇదా' అంటే అర్థం అనుకున్నదే-ఇంత ఆశా? ఇంత గర్వమా? అని.

కాని లక్ష్మణరావు అట్టేసేపు యీ దశలో ఉండలేదు. ఆ అమ్మాయి ఆ ఉత్తరం అమ్మకే రాసింది. తనకి కాదు. తనని మరచిపోయింది ఆ అమ్మాయి...ఇంకా చాలామందిని మరిచిపోతుంది. ఆశక్తి ఉంది ఆ అమ్మాయికి. ఉండాలి కూడానూ. తనే మరిచిపోడు. మరిచిపోలేడు. ఆ ఆకాశపథాల్లో ఉండే సౌందర్యాన్ని చూచి ఆనందించడానికి తన లాటివాళ్లు ఉండాలి. సౌందర్యం, ఆకర్షణ, ఇవి ఎవరికీ స్వంత ఆస్తులు అవవు. "అంత యిదా" అని ఎంత దూరదృష్టితో అంది!

రాఘవరావుకి నాగ్ మళ్ళా ఉత్తరంరాశాడు. ఈసారి ఉత్తరంలో కొంత ఆందోళన కనిపించింది. రాఘవరావుని ఎంతో సహాయం కావాలని ప్రార్థించాడు. నాగ్ కేమిటో రాఘవరావు మీద అంత విశ్వాసం. ఈసారి నాగ్ కలకత్తానుంచి రాశాడు. ఆ అమ్మాయి కలకత్తాలో ఉంది. ఏమయినాసరే...తల్లిదండ్రులని ధిక్కరించైనా సరే, తనపట్టు విడవనని రాశాడు. మహాప్రవాహవేగంలో ఉన్న గడ్డిపరక వడివేపు పోక, ఎదురుపోతానంటుందా? ఇంట్లో వాళ్ళు చాలాదూరం వచ్చేశారట. తాంబూలాలు పుచ్చేసుకున్నారట కూడా.

రాఘవరావు వ్యవహర్త. కొంచం జాగ్రత్తగా పరిస్థితులు గమనిస్తున్నాడు. ఆ ఊరు ఒకసారి వెళ్ళి వచ్చాడు. వాళ్ళనాన్న నాగ్‌కి రాసిందంతా నిజంకాదు. తాంబూలాలు పుచ్చుకోలేదు. ముహూర్తం పెట్టలేదు. ఈపని చేశామని రాస్తే, కుటుంబ గౌరవంకోసమేనా కొడుకు పెళ్ళికి వొప్పుకుంటాడని వాళ్ళాపని చేశారు. కాని ఇచ్చిపుచ్చుకోవడాలు నిశ్చయం అయిపోయాయి. ఆ మాటమాత్రం నిజం. కాని రాఘవరావుకి ఆ ఊళ్ళో, ఒక కొత్త సరికొత్త విషయం

తెలిసింది. అది జాగ్రత్తగాగా వినియోగించుకోవాలి. అందువల్ల వొచ్చేలాభం అపారం. అసలావిషయ మేమిటంటే...ఆ అమ్మాయికే యీ నాగ్‌ని చేసుకోవడం యిష్టంలేదుట. ఈ సంగతి పెళ్ళికూతురుకి అతి సన్నిహితవర్గాల ద్వారా ఎల్లాగో సాధించాడు రాఘవరావు. ఇది చాలా ఉపయోగకరమైన ముడిపదార్థం. సవ్యంగా ఉపయోగించాలి.

ఇంతకీ ఆ అమ్మాయికి యీ సంబంధమే చెయ్యాలని గట్టిగా పట్టుపట్టుతోంది ఆ అమ్మాయి తల్లిట. ఈ సంబంధం చేస్తే తన కూతురు సర్వవిధాలా సుఖపడుతుందని ఆవిడ నమ్మకంట. ఆ అమ్మాయి అన్నయ్య కిలాటివేమీ అక్కరలేదు. అతను లెక్కలోకి రాడు. పైకి ఏదీ తెలియపర్చని ఆ అమ్మాయి తన "యిష్టం" సంగతి అమ్మతో యింకా చెప్పనేలేదుట; దీని కంతటికీ కారణం, ఆ అమ్మాయి ఆరునూరైనా సరే పెళ్ళాడాలని అనుకున్న సుందరు డింకొకడుండటమేనట. ఐతే ఆ సుందరుడెవరో రాఘవరావుకి తెలియలేదు. తెలియవలసిన అవసరం లేదు. రాఘవరావుకి యీ కొత్త సంగతులు చాలా ఉత్సాహం కలిగించాయి. ఇలాటి సమయంలో తనకి చక్కగా సలహాయిచ్చే లక్ష్మణరావు ఉంటే బాగుండు ననిపించింది. కాని వాడు విపరీతమైన పనుల్లో ఉన్నాడు.

సరే-యిప్పుడు నాగ్ తనమీద ఆశ పెట్టుకున్నాడు. వాడి భారం తన నెత్తిమీద ఉంది. పైగా ఈ పనిలో ఆ అమ్మాయి యిష్టం కూడా కొంత నెరవేరుతోంది. వివాహం చెయ్యడానికి కొన్ని అబద్ధాలు ఆడమన్నారు పెద్దలు. ఇప్పుడు వివాహం చెడగొట్టడానికి కొన్ని నిజాలు చెప్పదలుచుకున్నాడు రాఘవరావు.

సమయం చూసుకుని రాసువరావు కృష్ణరాయపురం వెళ్ళాడు. ఈలోపుగా, ఏమీ గాభరా పడొద్దనీ, అన్నీ సవ్యంగా జరిపించే పూచీ తనదనీ నాగ్‌కి ఒక ఉత్తరం రాశాడు. తిన్నగా కృష్ణరాయపురంలో ఆ అమ్మాయి యింటికెళ్ళి, ఆవిడ తల్లిని కలుసుకున్నాడు. ఈలాంటి వ్యవహారాల్లో నాగ్ ఆరితేరినవాడు. ఎలా మాట్లాడాలో, ఎందుకు వచ్చినట్టు నటించాలో ఎలా వ్యవహారం నడపాలో, అతనికి బాగా తెలుసు. ఏదో స్నేహితులుండి, ఆ ఊరు వచ్చానన్నాడు. మెల్లిగా ఏదో చుట్టరికం కలిపాడు. వాళ్ళ కాబోయే అల్లుడు తనకి ఆప్త స్నేహితుడని చెప్పాడు. అతనిప్పుడు కలకత్తాలో ఉంటున్నాడన్నాడు. చివరికి, సావకాశంగా, ఏమీ దాచకుండా అతనినిగురించి ఆలోచనలు మానుకోవాలనీ, తలిదండ్రుల అభిప్రాయాలెలా ఉన్నా, ఆ అబ్బాయి యీ సంబంధానికి సిద్ధంగాలేడనీ, అతని ఊహాలు, ఆశలు, వేరేచోట భద్రంగా ఉన్నాయనీ, యీ పెళ్ళి జరగదనీ...అనవసరంగా పట్టుబట్టి తెగేదాకా లాగితే, ఆడపిల్లవారి కుటుంబం చాలా అప్రతిష్ఠకి లోనవుతుందనీ, నిర్మొహమాటంగా చెప్పాడు. ఇంత చురుకుగా సూటిగా నిజం చెప్పగలవాళ్ళని ఆవిడ యింతకు ముందెప్పుడూ చూడలేదు తను చెప్పినవన్నీ నిజమని చెప్పి ఒక ఆడదాన్ని ఒప్పించడానికి తగినన్ని ఋజువులు రాఘవరావుదగ్గిర ఉన్నాయి.

అప్పటికే కూతురి మనసు తల్లి కొంత పసిపట్టింది. ఈ పెళ్ళి కావాలని తన పట్టుదలకూడా తన కూతురేదో సుఖపడుతుందనేగా! రాఘవరావు మాటలు ఆవిడలో చాలా మార్పు కలిగించాయి. ఆవిడ అంచనాలు తల్లకిందులైపోతూంటే, మామూలుగా ఆడవాళ్ళకి వొచ్చే ఉక్రోషం ఆవిడకి రాలేదు. ఆవిడ అహం దెబ్బతినలేదు. కాని ఆవిడ ఏమీ మాట్లాడలేదు. గంభీరంగా ఊరుకుంది. రాఘవరావు శలవు తీసుకొని ధైర్యంగా ఇంటికి వచ్చేశాడు.

తన యింటికి ఎవరో అజ్ఞాతవ్యక్తి వచ్చి తన తల్లిని మార్చేశాడని ఆ అమ్మాయికి తెలియదు. ఆ అమ్మాయి తనకోసం ఎదురుచూస్తోందని లక్ష్మణరావుకి తెలియదు. రఘు వెళ్ళి తనని రక్షించాడని నాగ్‌కి తెలియదు. ఈ పెళ్ళి జరగకుండా ఆగిపోతుందని నాగ్ తలిదండ్రులకి తెలియదు. ఈ తెలియకపోవడాలలోనే ఉంది అసలు ఇదంతా. ఆవేళ ఆ అమ్మాయిదగ్గిరనుంచి మరో ఉత్తరం వచ్చింది—లక్ష్మణరావు అమ్మ పేరనే. మొన్నటి ప్రోగ్రాం విన్నారాలేదా? ఎలా ఉందో ఏమీ రాయలేదేం? లక్ష్మణరావు విన్నాడా? అంత మూగనోము పట్టేడేం? వ్రతమా? కోపమా?

ఈసారి మళ్ళా... తారీఖున సాయంత్రం మరో ప్రోగ్రాం ఉంది. విని, (మీరిద్దరూ) ఎలా ఉందో రాస్తారుగా. లక్ష్మణరావుకీ, నాకూ సంగీతం ఎల్లాగూ అర్థంకాదుకాని, మీరేనా రాయండి ఎలా ఉందో" ఉత్తరం చాలాచిన్నది లక్ష్మణరావు ఏమనుకున్నాడో తెలియదు ఆ ఉత్తరం చూచి. కాని అప్రయత్నంగా అతని మొహంమీద చిరునవ్వు కనిపించింది. ఎన్నాళ్లు అయిందో అతనలాంటి నవ్వు నవ్వి. కాని... అతనికా ఉత్తరం అర్థమయిందా?

ఒకరోజు సాయంత్రం ఆ అమ్మాయి తల్లి చక్కా వచ్చింది లక్ష్మణరావు యింటికి. రావడమేమిటి. మీ అబ్బాయికోసం మా పిల్ల తపస్సు చేస్తోంది. మీవాడికి ఒప్పించాలి అనడమేమిటి అన్నీ జరిగిపోయాయి. లక్ష్మణరావు తల్లి ఏమీ అనలేదు. "మావాడి యిష్టం నేనేమీ కాదనను" అంది అంతే. ఆవిడకీ తెలుసు, ఆ అమ్మాయికోసం తన కొడుకూ తపస్సు చేస్తున్నాడని. "అలా కాదు మీరు మాటివ్వా"లంది ఆ అమ్మాయి తల్లి. "ఏమీ మాటివ్వక్కరలేదమ్మా... మావాడూ, మీ పిల్లా, ఒకయింటివాళ్లు కావడానికేపుట్టారు. మనమెవరం మాట యివ్వడానికీ, కాదనడానికీ"అంది ఆవిడ.

ఆఫీసునుంచి లక్ష్మణరావు వచ్చాడు. ఆ వేళే రేడియో ప్రోగ్రామ్ వినాలి. ఆ అమ్మాయి తల్లి గొంతుక వినిపించింది. ఆ అమ్మాయి కూడా వచ్చిందేమో. ఎలా వస్తుంది. యీపాటి రేడియో స్టేషనులో ఉంటుంది. లోపలి కెళ్ళాక, అమ్మ "పెళ్ళివా రొచ్చారోయ్! నీకు వాళ్ళమ్మాయి నిస్తారట, చేసుకుంటావా?" అంటోంది. ఆవిడ కళ్ళు వెలిగిపోతున్నాయి.

లక్ష్మణరావు ఎన్నడూ సిగ్గుపడలేదు. ఈసారి మొహం వంచేసుకుని గదిలోకి వెళ్ళిపోయాడు. తరువాత అమ్మ అంతా చెప్పింది. లక్ష్మణరావు మాట్లాడలేదు. అతనికి మాటలు దొరకలేదు.

రేడియో వినడానికి బయలుదేరాడు. ఇప్పుడు అర్థమయింది ఆ అమ్మాయి ఉత్తరం. ఆ ఉత్తరం అమ్మకి రాసింది యిందుకా? అందులో తనకు వ్యంగ్య ప్రాముఖ్యం యిందుకా? ఎంత చిలిపి పిల్ల! ఆనాటి 'ఇది'కి అర్థం యిదీ. అవునా? కనుక్కోవాలి.

రాఘవరావు యింటికి వెళ్ళి రేడియోలో పాట విన్నాడు. రేడియోలో పాడుతున్నది తన కథలో నాయిక అనుకున్నాడు రాఘవరావు. తన కథా నాయిక అనుకున్నాడు లక్ష్మణరావు.

రాఘవరావు చెప్పాడు ఆ రోజున చెప్పక మానిన మిగతా కథ. ఆ అమ్మాయి కిష్టంలేక పోవడం. తను వెళ్ళి ఆ కష్టం తొలగించడం. లక్ష్మణరావు మనసులో ఎంత ఆశ్చర్యపోయాడో ఎంత పొంగిపోతూడో! కాని, దొంగ, పైకి ఒక్కమాట చెప్పలేదు. ఏమీ ఎరగనివాడిమల్లే యింటికి వచ్చేశాడు.

* * *

నాగ్‌కీ పార్సీ అమ్మాయికీ పెళ్ళి అయిపోవడం, అప్పుడు వీళ్ళంతా శుభాకాంక్షలు పంపడం, తత్పర్యవసానాలూ అట్టే ప్రమాదకరంగా లేవు. కాని తాను పెళ్ళి తప్పించిన ఆ అమ్మాయి వరించిన 'సుందరుడు' లక్ష్మణరావే అని తెలిసేసరికి రాఘవరావు ఆశ్చర్యపోయాడు. తాను యిద్దరికి పెళ్ళి చేశానన్నమాట. తెలిసి ఒకరికీ, తెలియక మరొకరికీ. లక్ష్మణరావు ఒక్క ముక్కయినా పైకి పొక్కనీయలేదు. దొంగ! అందుకా యింత ప్రత్యేకంగా, పనిగట్టుకునివచ్చి సంగీతం విన్నాడు!

లక్ష్మణరావుకీ, ఆ అమ్మాయికీ పెళ్ళి అయిపోయింది. ఎవ్వరినీ విపరీతంగా బాధపెట్టని గాలి దుమారం పూర్తిగా తగ్గిపోయినందుకు యిద్దరూ సంతోషించారు. పవిత్ర ప్రేమపథం ఎన్నడూ సుగమంగా ఉండదన్నాడు షేక్స్పియరు. "ఈమాత్రం గాలిదుమారం ఉండకపోతే మనది పవిత్రప్రేమ అనిపించుకోదు" అన్నాడు లక్ష్మణరావు. "అన్నరునుబట్టి లెక్కవేసుకుంటున్నారు తమరు" అంది ఆ అమ్మాయి-పెదిమలు సన్నంగా నొక్కి, వాటి చివరల గుంటలుపడగా, గడ్డం సూదిగాచేసి కళ్లు ఓరగాపెట్టి. చటుక్కున జ్ఞాపకంవచ్చింది లక్ష్మణరావుకి. "ఆవేళ...'అంత యిదా' అన్నావు 'ఇది' అంటే ఏమిటి నీ ఉద్దేశంలో?" ఆ అమ్మాయిని రెండుచేతుల్లోకి తీసుకుని అడిగాడు. ఆమె తనమొహం దగ్గిరగాతెచ్చి తనని ఒక్కముద్దు పెట్టుకని "ఇది-అంటేనా... ఏమిటూ?ఇదంటే-ఇదే"అంది కొంటెగానవ్వుతూ.